తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
శనివారం
26 సెప్టెంబర్ 2026

## 33/11 కేవీ మినీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి

- కోతలు, వోల్టేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం





**మక్తల్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** మక్తల్ పట్టణ ప్రజల చిరకాల స్వప్నమైన విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించింది. పట్టణంలో కరెంటు కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ఏర్పాటు చేసిన నూతన 33/11 కేవీ మినీ సబ్‌స్టేషన్‌ను మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి శ్రీహరి మాట్లాడుతూ మక్తల్ పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన, ఎలాంటి అంతరాయం లేని విద్యుత్‌ను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.
మక్తల్‌లో గతంలో ఉన్న విద్యుత్ లోడ్ సమస్యలు, తరచూ కరెంటు పోవడంతో ప్రజలు ఇబ్బంది పడేవారు. ఈ మినీ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో ఆ సమస్యలన్నీ తొలగిపోతాయి. భవిష్యత్తులో లో వోల్టేజీ సమస్యలకు పూర్తిగా చెక్ పెట్టి, ప్రజలకు అత్యుత్తమ విద్యుత్ సేవలు అందుతాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యుత్‌శాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



శ్రీరంగాపూర్ దేవాలయాన్ని సందర్శించి తనిఖీ చేస్తున్న ఎస్పీ డి సునీత రెడ్డి

## రబీ కార్యాచరణ ప్రణాళికపై సాంకేతిక సమావేశం



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 25 (జనంసాక్షి);** జోగులాంబ గద్వాల జిల్లా ఐ డి ఓ సి లోని జిల్లా వ్యవసాయ అధికారి ఛాంబర్‌లో జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప ఆధ్వర్యంలో రబీ కార్యాచరణ ప్రణాళికపై సాంకేతిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టి ఆర్ వి కె గద్వాల సమన్వయకర్త డా. పి. అర్చన, నీటిపారుదల శాఖ డి ఈ శివకృష్ణ, డి హెచ్ ఎస్ ఓ రాజ్‌కుమార్, కె వి కె మదనాపురం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రాజేందర్ రెడ్డి సంబంధిత అధికారులు హాజరయ్యారు.
సమావేశంలో జోగులాంబ గద్వాల జిల్లాలో రబీ పంటల మండలాల వారీగా అంచనా విస్తీర్ణాన్ని ఖరారు చేయడం, జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు అందుబాటులో లేని పరిస్థితుల్లో చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై చర్చించారు. నీటిపారుదల శాఖ డి ఈ శివకృష్ణ మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు నుంచి నవంబర్ వరకు వారాబందీ పద్ధతిలో, ప్రతి మూడు రోజులకు ఒకసారి నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. నవంబర్ అనంతరం నీటి లభ్యతపై స్పష్టమైన హామీ లేనందున, నీటి లభ్యత లేని ప్రాంతాల్లో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సాంకేతిక అధికారులు సూచించారు.
నీటి లభ్యత, నేల పరిస్థితులు, స్థానిక వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని మండలాల వారీగా ప్రత్యామ్నాయ పంటలను గుర్తించారు. ముఖ్యంగా మినుములు, శనగలు, మొక్కజొన్న, రబీ జొన్న పంటల విస్తీర్ణాన్ని పెంచేలా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను రూపొందించారు.
ఏ టి ఎం ఎ నిర్వయన్ కార్యక్రమం అమలు, పప్పుధాన్యాల సాగు ప్రోత్సాహం, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల అవలంబన, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రబీ పంటల ప్రణాళికపై సమావేశంలో చర్చించారు.

## గ్రంథాలయ సెస్ త్వరితగతిన వసూలు చేయాలి...

- జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 25(జనంసాక్షి);** గ్రంథాలయ సెస్ వసూళ్లలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని అదనపు కలెక్టర్ నర్సింగ రావు ఆదేశించారు.
శుక్రవారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయ సెస్ వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ,మున్సిపల్ అధికారులు ఇంటి పన్నుల్లోని 0.8 శాతం గ్రంథాలయ సెస్‌ను వసూలు చేసి జిల్లా గ్రంథాలయ సంస్థకు జమ చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు ఉన్న గ్రంథాలయ సెస్ బకాయిలను త్వరగా వసూలు చేసి, జిల్లా గ్రంథాలయ సంస్థ, జోగులాంబ గద్వాల ఖాతాలో జమ చేయాలని సూచించారు.
గ్రంథాలయ సెస్ వసూళ్లలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.
ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ఎం. మనోజ్ కుమార్,జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్,మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికే అత్యధిక ప్రాధాన్యం

- ఎంవీఎస్ జూనియర్ కళాశాల & ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల అభివృద్ధికి 15 కోట్ల మంజూరు
- ఏఐ యుగంలో టెక్నికల్, స్కిల్ ఎడ్యుకేషన్‌కు పెద్దపీట..
- పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి



మిగతా 2లో..

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల అభివృద్ధితో పాటు సాంకేతిక, నైపుణ్య విద్యకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు.
బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి రూ. 6.86 కోట్లతో భవన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎంవీఎస్ జూనియర్ కళాశాల అభివృద్ధికి రూ. 7.95 కోట్లతో ఆధునిక భవనాలు నిర్మించి, భవిష్యత్‌లో కేజీ నుంచి 12వ తరగతి వరకు విద్య అందించే సమగ్ర విద్యాసంస్థగా తీర్చిదిద్దే ఆలోచన ఉందన్నారు. ఎంవీఎస్ డిగ్రీ కళాశాల సమగ్ర అభివృద్ధికి సుమారు రూ. 70 కోట్ల అంచనాతో దశలవారీగా పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కళాశాల 60వ వార్షికోత్సవాన్ని పూర్వ విద్యార్థుల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## హెచ్చరించినా మారని తీరు.. పదర ఆసుపత్రిలో సమయపాలన ఎక్కడ?



**అమ్రాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** పదర ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైద్య సేవలు అందాల్సిన సమయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. పలువురు రోగులకు ఏఎన్ఎంలే అందుబాటులో ఉంటూ ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొంటున్నారు.
గత నెలలో ఎమ్మెల్యే ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి, వైద్య సిబ్బంది విధులకు సకాలంలో హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించినట్లు స్థానికులు తెలిపారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని హెచ్చరించినప్పటికీ, ఆ తర్వాత కూడా పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**'ఆయారామ్.. గయారామ్' అన్న చందంగా..**

వైద్య సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, 'ఆయారామ్.. గయారామ్' అన్న చందంగా వ్యవహరిస్తున్నారంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు సక్రమంగా అందకపోతే పేద, సామాన్య ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు. దీంతో వైద్య ఖర్చుల భారం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

**డాక్టర్ వివరణ...**

స్థానికుల ఆరోపణలపై డాక్టర్ పావనిని వివరణ కోరగా, తాను మధ్యాహ్నం 2:30 గంటల వరకు ఆసుపత్రిలోనే విధుల్లో ఉంటానని తెలిపారు. అనంతరం గ్రామాల్లో వైద్య సేవల కోసం విజిట్ చేయాల్సి ఉంటుందని వివరించారు. ఆసుపత్రిలో సిబ్బంది అందుబాటు, విధుల నిర్వహణపై స్థానికులు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాల నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి పరిస్థితిని పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.



# వేంకల్‌లో అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్



పెంట్లవెల్లి, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవెల్లి మండలం వేంకల్ మల్లేశ్వరం గ్రామంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శుక్రవారం పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.

**అంగన్వాడీకి సొంత భవనం నిర్మించాలి...**

గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రీ-స్కూల్ విద్య, తాగునీరు, పారిశుధ్య సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి చిన్నారులకు సురక్షిత వాతావరణం కల్పించాలని సూచించారు. అంగన్వాడీకి సొంత భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరగా, అవసరమైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు.

**వీవో భవన పనుల్లో నాణ్యత తప్పనిసరి...**

గ్రామంలో నిర్మిస్తున్న వీవో భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. స్లాబ్ లెవల్ వరకు పూర్తైన పనుల పురోగతిని పరిశీలించి, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

నాణ్యమైన మెటీరియల్ వినియోగించడంతో పాటు పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

**రీ సర్వే పారదర్శకంగా చేపట్టాలి...**

అనంతరం గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, భూ రికార్డులు, సర్వే పురోగతి, హద్దుల నిర్ధారణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వేను పారదర్శకంగా, తప్పులు లేకుండా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ, అటవీ, పట్టా భూముల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, జిల్లా సర్వేయర్ గిరిధర్, పెంట్లవెల్లి తహసీల్దార్, సర్పంచ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో అన్నప్రాసన....



పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): పెద్ద శంకరంపేటలోని 9వ నెంబర్ అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం అన్న ప్రసన్న కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పోషణ మాసంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారంపై గర్భిణీ స్త్రీలు బాలింతలకు చిన్నారులకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్న ప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అంగన్వాడి టీచర్ సరళ తెలిపారు. గర్భిణీ స్త్రీలకు బాలింతలకు చిన్నారులకు పౌష్టికాహారం పై అవగాహన కల్పిస్తున్నామన్నారు..

## ఘనంగా గణేష్ నిమజ్జన వేడుకలు



నంగునూరు, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): మండల కేంద్రంలో శ్రీ వైష్ణవి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. శోభాయాత్రగా సాగిన గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యువతతో కలిసి నిమజ్జనోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గణేష్ ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పవన్‌కుమార్ అన్నారు. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. 'గణపతి బప్పా మోరియా' నినాదాల మధ్య యువత నృత్యాలు చేస్తూ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సిర్రం ఆంజనేయులు, సాయి కుమార్, నాగరాజు, గోనపల్లి శివప్రసాద్, నరసింహులు, శేఖర్, భానురాజు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు





మెదక్ మండలం, సెప్టెంబర్ 25 (జనం సాక్షి): మెదక్ పట్టణంలో వినాయక మండపాల సందర్శన అనంతరం మెదక్ మండలం కొంటూరు చెరువు లో నిమజ్జన ఏర్పాట్ల పరిశీలించారు. అనంతరం కొముటూరు చెరువు వద్ద వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన నిమజ్జన స్థలాన్ని పరిశీలిం చారు. నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో మెదక్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ పట్టణ అధ్యక్షుడు మందుల గంగాధర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మార్గం నాగరాజు సర్పంచ్ యాదగౌడ్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కానుగు భూపతి రాజు సిద్ది రాములు కాంగ్రెస్ పార్టీకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాధవనగర్ కాలనీలో రూ.3.09 లక్షలకు లడ్డూ వేలం





పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): పట్టణంలోని మాధవనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిర్వహించిన లడ్డూ వేలంలో హైదరాబాద్ మేడ్చల్‌కు చెందిన గజం సాయికిరణ్ రూ.3,09,999కు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సాయికిరణ్‌ను అభినందించి సన్మానించారు. అదే కాలనీలో నిర్వహించిన రెండో లడ్డూ వేలంలో సాంబయ్యగారి ప్రభాకర్ రూ.66,666కు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం పట్టణంలోని పలు వినాయక విగ్రహాలను అలంకరించిన వాహనాలపై ఊరేగించి తిరుమలాపూర్ చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాధవనగర్ కాలనీ అధ్యక్షుడు రాగం శ్రీనివాస్, కమిటీ సభ్యులు ప్రభాకర్, భానుప్రకాష్, పెంటయ్య, డాక్టర్ సంగమేశ్వర్‌రెడ్డి, చకిలం సంతోష్‌కుమార్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూర్‌లో 'ఫ్రైడే-డ్రై డే' అవగాహన

ఆత్మకూర్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆత్మకూర్ కోసం ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎ.నరేష్‌కుమార్ కోరారు. శుక్రవారం 10వ వార్డులో 'ఫ్రైడే--డ్రై డే' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలించి, దోమల వృద్ధికి అవకాశం లేకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు. నీటి నిల్వలను ఎప్పటికప్పుడు ఖాళీ చేసి శుభ్రపరచుకోవాలని, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## వందేమాతరం సామూహిక గీతా లాపన....



పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి): విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ న్యూఢిల్లీ పిలుపుమేరకు నమామి భారతం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులు సామూహిక వందేమాతరం గీతాలాపన పెద్ద శంకరంపేటలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయా పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీ సరస్వతి శిశు మందిర్. సంస్కార్ విద్యాలయం. మంథన్ పాఠశాల. సాయి చైతన్య పాఠశాల డాన్ బాస్కో పాఠశాల కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సామూహిక వందేమాతర గీతాలాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిశు మందిర్ ప్రబంధ కారిని సభ్యులు జంగం రాఘవులు, క్రాంతి లాల్, ప్రధానాచార్యులు లక్ష్మీనారాయణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు. కరస్పాండెంట్లు సీతారామారావు, గంగాధర్ గౌడ్ నాగ్ నాథ్, శ్రావణి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ సాంకేతిక అధికారిగా ఎడ్మ శ్రీను యాదవ్ ఎన్నిక



అచ్చంపేట సెప్టెంబర్ 25 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26,27 తేదీలలో వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి అండర్ 14,16,18,20, మెన్, ఉమెన్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ కు నాగర్ కర్నూల్ జిల్లా పదర మండల కేంద్రానికి చెందిన సీనియర్ క్రీడాకారులు ఎడ్మ శ్రీను యాదవ్ సాంకేతిక అధికారిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి సాంకేతిక అధికారిగా ఎంపిక చేసిన రాష్ట్ర టెక్నికల్ కమిటీ, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సాంకేతిక అధికారిగా నియామకం పట్ల సీనియర్ క్రీడాకారులు కుటుంబ సభ్యులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## 28న రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక



మిడ్జిల్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో ఈ నెల 28న రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు సత్యం గుప్తా తెలిపారు. మూడు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరగాల్సి ఉండగా, ప్రస్తుత జిల్లా కార్యవర్గం ఏర్పడి దాదాపు పదేళ్లు కావస్తోందన్నారు.

సీనియర్ డీలర్ల సూచనల మేరకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

డీలర్ల సమస్యలు, హక్కులు, సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

అన్ని మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, డీలర్లు పెద్ద సంఖ్యలో హాజరై ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు.

## జాషువా సాహిత్య సదస్సును విజయవంతం చేయాలి



వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): అస్పృశ్యత, అసమానతలకు వ్యతిరేకంగా సామాజిక స్పృహతో రచనలు చేసిన మహాకవి గుర్రం జాషువా సాహిత్య సేవలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ నెల 29న సాహితీ సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ తెలిపారు. వనపర్తి పట్టణంలోని ఎం.ఎన్.ఆర్. ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం 4 గంటలకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో సదస్సు జరుగుతుందని చెప్పారు. జాషువా 131వ జయంతి వేడుకలను ఈ నెల 28న ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

వనపర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలుస శంకర్‌గౌడ్, డాక్టర్ వీరయ్య, నారాయణరెడ్డి, ఎం. రాజశేఖర్ మాట్లాడారు. సామాజిక అసమానతలను రూపుమాపేందుకు జాషువా తన రచనల ద్వారా చైతన్యం కల్పించారని పేర్కొన్నారు. ఆయన సాహిత్య, సామాజిక స్పృహను భావితరాలకు అందించడమే సదస్సు లక్ష్యమన్నారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఆత్మీయ అతిథులుగా రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. సాహిత్య, కళారంగాలను ప్రోత్సహిస్తున్న నిరంజన్‌రెడ్డి గతంలో కవి సమ్మేళనాలు, సి.నారాయణరెడ్డి జయంతి, సురవరం ప్రతాపరెడ్డి సాహితీ సదస్సులు నిర్వహించారని పేర్కొన్నారు.

కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, విద్యార్థులు, యువత, బహుజనులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు లక్ష్మీప్రసన్న ఎంపిక

**కోహెడ, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** కోహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని బసవరాజు లక్ష్మీప్రసన్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల సిద్దిపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-16 విభాగం షాట్‌పుట్, జావెలిన్ త్రోలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ మహమూద్ తెలిపారు. ఈ నెల 27న హనుమకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో లక్ష్మీప్రసన్న పాల్గొననుంది. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయురాలు పుష్పలతతో పాటు ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్ బందెల సుజాత-బాలకిషన్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, ఏఏపీసీ చైర్ పర్సన్ ముంజ మంజుల, గ్రామస్థులు విద్యార్థినిని అభినందించారు.

## నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ అండ



**పుల్కల్, సెప్టెంబర్ 25(జనంసాక్షి):** పేద ప్రజలకు వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోయిని శ్రీనివాస్ తెలిపారు. పుల్కల్ గ్రామానికి చెందిన మ్యాతరి మంజుల భర్త పెంటయ్య,ఈసోజీపేట సాయికృష్ణ తండ్రి నరసింహులు ఇద్దరికి రూ.60 వేల చొప్పున మొత్తం రూ.1.20 లక్షల సీఎంఆర్ ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు చెక్కులు అందజేసినట్లు వారు తెలిపారు. వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించిన మంత్రికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. మండల యువజన అధ్యక్షుడు ఉదయ్, వార్డు సభ్యులు చింత నరేందర్, మన్నె రాములు, మంగలి రాజు,తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో అన్న ప్రసన్నం సీమంతం



**చిన్న శంకరంపేట్, సెప్టెంబర్ 25(జనంసాక్షి):** కామరం తండా అంగన్వాడి కేంద్రంలో అన్న ప్రసన్నంతో పాటు సీమంతం చేయడం జరిగింది. లిసర్పంచ్ డాక్టర్ హలవత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ తల్లులు సంతోషంగా ఉండడం, అంగన్వాడి ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం తీసుకోవడం అన్నప్రసానం ద్వారా ఆరు నెలలు నిండిన చిన్నారులకు తల్లిపాలతో తొలిసారిగా ఘన ఆహారం తినిపించే పవిత్రమైన ఘట్టం చేయబడింది ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ పద్మ, అంగన్వాడి టీచర్లు శాంతి,నీలా, శాంత ఉపసర్పంచ్ విజయ, వార్డ్ మెంబర్లు గోపాల్, మోహన్, నరేష్, తార్య, భీమ తదితరులు పాల్గొన్నారు.

## రూ.36 లక్షలకు వినాయకుడి లడ్డూ వేలం



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** రాఘవాపూర్ పంచవటి క్షేత్రంలో వినాయకుడి లడ్డూ వేలం రికార్డు ధర పలికింది. కోహీర్ మండలం చింతల్‌గట్టుకు చెందిన అవుసలి వీరన్న దంపతులు రూ.36,00,001కు లడ్డూను దక్కించుకున్నారు. ఇది జిల్లాలోనే అత్యధిక ధరగా నిర్వాహకులు తెలిపారు. వేలంలో బీదర్‌కు చెందిన అమర్ పాటిల్ రూ.35 లక్షలకు పోటీ పడగా, వీరన్న దంపతులు అధిక ధరకు లడ్డూను సొంతం చేసుకున్నారు. వీరన్న పంచగామ పీఠాధిపతి కాశీనాథ్ బాబా శిష్యుడు. రెండు రోజుల క్రితం పంచగామలో జరిగిన వేలంలో మాచాపూర్‌కు చెందిన రంగ సంగమేశ్వర్‌గౌడ్ రూ.17,00,001కు లడ్డూను దక్కించుకున్నారు. ఈ రెండు వేలాల్లో విజేతలు కాశీనాథ్ బాబా శిష్యులే విశేషం.

# అనంతారం భూములపై 22ఏ నిషేధం ఎత్తివేయాలి

- **పేద రైతుల భూములను సమగ్రంగా పరిశీలించాలి**
- **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి డిమాండ్**



**గుమ్మడిదల, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** గుమ్మడిదల మండలం అనంతారం గ్రామంలోని సర్వే నంబర్లు 173, 174లోని భూములపై విధించిన 22ఏ నిషేధాన్ని ఎత్తివేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. పేద రైతులకు సంబంధించిన భూములపై రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను పరిశీలించాలని కోరారు.

సర్వే నంబర్ 173లో మొత్తం 59 ఎకరాలు పట్టా భూములేనని, సర్వే నంబర్ 174లోని 110 ఎకరాల 21 గుంటల్లో 21 ఎకరాలు మాత్రమే ప్రభుత్వ భూమి అని, మిగతా భూములు పట్టా భూములని గోవర్ధన్ రెడ్డి తెలిపారు.

సర్వే నంబర్ 174లోని 39.19 ఎకరాలను 1965లో ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధుల కోటా కింద కేటాయించిందని, అనంతరం కోర్టు ఆదేశాలతో విక్రయ హక్కులు లభించడంతో 1975లో స్థానిక పేద రైతులకు విక్రయించినట్లు పేర్కొన్నారు. మరో సుమారు 50 ఎకరాలను కూడా అప్పటి ప్రభుత్వం గ్రామంలోని పేద రైతులకు కేటాయించిందన్నారు.

**రికార్డులు పరిశీలించాలి...**

1978--79 రెవెన్యూ రికార్డుల్లో భూములు పొందిన రైతుల పేర్లు నమోదై ఉన్నాయని ఆయన తెలిపారు. గతంలో ప్రభుత్వం పట్టాలు, రిజిస్ట్రేషన్లు చేసిన భూములను 22ఏ జాబితాలో చేర్చడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రస్తుతం ఈ రెండు సర్వే నంబర్లలో 150 మందికి పైగా రైతులు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలించి అర్హత ఉన్న పట్టా భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి, జిల్లా కలెక్టర్‌ను గోవర్ధన్ రెడ్డి కోరారు. రైతులకు న్యాయం చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో అనంతారం గ్రామ సర్పంచ్ శ్రీను, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు కుమార్ గౌడ్, చక్రపాణి, గ్రామ నాయకులు జింక గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## దుద్దెడలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**కొండపాక, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** దుద్దెడ గ్రామంలో గ్రామ సర్పంచ్ మిద్దె శివకుమార్, మాజీ సర్పంచ్ పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి తొమ్మిది మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారికి రూ.1.49 లక్షల విలువైన చెక్కులు అందజేశారు. నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందడం వరమని సర్పంచ్ శివకుమార్ అన్నారు. ఆరోగ్య సమస్యల సమయంలో ప్రభుత్వం అందించే సహాయం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, ఉపసర్పంచ్ పల్లె జానకి యాదగిరి, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జర్నలిస్టును పరామర్శించిన మాజీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్



**అల్లాదుర్గం, సెప్టెంబర్ 25(జనంసాక్షి):** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది కోలుకుంటున్న మండల సాక్షి విలేకరి సీనియర్ పాత్రికేయులు మజ్జిగ వీరేందర్‌ను మాజీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి పరామర్శించి అధైర్య పడవద్దని ధైర్యం చెప్పారు ఆయన వెంట నాయకులు మోహన్ రాథోడ్, సాయికుమార్ తదితరులున్నారు.

## కరెంటు కట్ చేశారు..

**వైర్లు మాత్రం తొలగించలేదు!**



**గోపాలపేట, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో బుద్ధారం గ్రామానికి చెందిన షరీఫా ఇంటి నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడింది. ఇంటి మధ్యలో నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను తొలగించాలని పలుమార్లు అధికారులను వేడుకున్నా స్పందన లేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేసినా, అడ్డుగా ఉన్న తీగలను తొలగించకపోవడంతో పిల్లర్ల మధ్యలోనే వేలాడుతున్నాయని తెలిపింది. దీంతో గోడలు నిర్మించడం, స్లాబ్ వేయడం వంటి పనులు నిలిచిపోయాయని పేర్కొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తీగలను పక్కకు మార్చి ఇంటి నిర్మాణానికి సహకరించాలని షరీఫా, గ్రామస్తులు కోరుతున్నారు.

## మానవత్వం చాటుకున్న సీపీఐ నేత అందె అశోక్

- **అభినందించిన చేర్యాల ఎస్ఐ అపూర్వరెడ్డి**



**చేర్యాల, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** రోడ్డుపై దొరికిన మొబైల్ ఫోన్‌ను యజమానికి అప్పగించి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టు అందె అశోక్ మానవత్వాన్ని చాటుకున్నారు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన అందె అశోక్ శుక్రవారం తన పని మీద చేర్యాలకు వస్తుండగా ఆకునూరు-చేర్యాల మార్గమధ్యలో రహదారిపై ఒక మొబైల్ ఫోన్ పడి ఉండటం గమనించారు. వెంటనే ఆ ఫోన్‌ను తీసుకొని చేర్యాల పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. పోలీసులు ఫోన్ నెంబర్ ఆధారంగా యజమానిని గుర్తించగా ధూళిమిట్ట మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన గద్దల స్నేహగా తేలింది. పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గూడ అపూర్వరెడ్డి చేతుల మీదుగా 50వేల విలువ చేసే మొబైల్ ఫోన్‌ను యజమాని స్నేహకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ అపూర్వరెడ్డి అందె అశోక్ నిజాయితీని,మానవత్వాన్నిఅభినందించారు. నిజాయితీగా వ్యవహరించిన అశోక్ పై స్థానికులు ప్రశంసలు కురిపించారు.

## కోహిర్‌లో ఘనంగా 'ఫ్రైడే-డ్రై డే'





**కోహిర్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** కోహిర్ మున్సిపాలిటీలో చైర్మన్ ఎం.అశోక్, వైస్ చైర్మన్ అన్నం జావిద్ ఆధ్వర్యంలో 'ఫ్రైడే-డ్రై డే' కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ పాలకవర్గం, అధికారులు, సిబ్బంది పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పాత టైర్లు, కొబ్బరి బోండాలు, పూల కుండీలు, కూలర్లలో నీటిని తొలగించాలని కోరారు. సిబ్బంది నిల్వ నీటిని తొలగించి, అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వీధి కుక్కల పట్ల జాగ్రత్తలపై కూడా అవగాహన కల్పించారు. ప్రజల భాగస్వామ్యంతోనే వ్యాధుల నియంత్రణ సాధ్యమని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, వార్డు అధికారులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు లీలా గ్రూప్ చైర్మన్ ఆర్థిక సాయం



**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** ఆపదలో ఉన్న పలు నిరుపేద కుటుంబాలకు లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ ఆర్థిక సాయం అందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన దిశ విలేఖరి దేవరాజును పరామర్శించి రూ.10 వేల సాయం చేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దూదేకుల షబ్బీర్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

కామారం తండాలో ప్రమాదంలో మృతి చెందిన మూడవత్ కుమార్ కుటుంబంతో పాటు గుండెపోటుతో మృతి చెందిన హలావత్ యాదగిరి కుటుంబానికి కూడా సాయం అందించారు. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకున్న మోహన్ నాయక్‌కు కామారం తండా సర్పంచ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అభినందనలు తెలిపారు.

# గణేష్ నిమజ్జనం పకడ్బందీగా నిర్వహించాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

## • గణేష్ నిమజ్జనం చేయు చెరువు దగ్గర జాగ్రత్తలు పాటించాలి

**మక్తల్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** మక్తల్‌లో గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా బందోబస్తు విధులకు వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మక్తల్ రాయల్ ఫంక్షన్ హాల్‌లో భద్రతా సూచనలు చేశారు.

**ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...**

గణేష్ నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శోభాయాత్ర, నిమజ్జన మార్గాల్లో సీసీ కెమెరాల నిఘాతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు సంయమనంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు.

**చెరువు దగ్గర జాగ్రత్తలు పాటించాలి...**

అనంతరం మక్తల్ మినీ ట్యాంక్ బండ్ నిమజ్జన ప్రాంతాన్ని ఎస్పీ పరిశీలించారు. నిమజ్జనం సమయంలో చిన్నపిల్లలు చెరువు వద్దకు రాకుండా జాగ్రత్తలు



తీసుకోవాలని, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ డైవర్షన్లు చేపట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అంబులెన్స్, ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం డీజేలకు అనుమతి లేదని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి డీజేలు వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఎస్పీ స్పష్టం చేశారు. అలాగే గణేష్ నిమజ్జనోత్సవాల సందర్భంగా మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని, అక్రమ మద్యం విక్రయించే బెల్ట్ షాపులపై





దాడులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గణేష్ ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనం వేడుకల్లో వంగ రాజేశ్వర్ రెడ్డి





**నంగునూరు, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** నంగునూరు మండలంలోని ఖాతా గ్రామంలో నల్లపోచమ్మ గల్లి యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వంగ రాజేశ్వర్ రెడ్డి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిమజ్జనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు వినూత్నంగా నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతగా నిలిచిన ఆకోజి సంధ్యకు రాజేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ఎలక్ట్రిక్ బైక్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజకవర్గంలోనే తొలిసారిగా ఇలాంటి వినూత్న ఆలోచనతో లక్కీ డ్రా నిర్వహించి యువతను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలు, సామాజిక సేవ, ఉపాధివైపు అడుగులు వేయాలని సూచించారు. సృజనాత్మక ఆలోచనలతో ముందుకు వచ్చే యువతకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సంతోష్ నగర్ సర్పంచ్, గట్ల మల్యాల మాజీ సర్పంచ్ రమేష్, మాజీ ఉపసర్పంచ్ ప్రకాష్ రెడ్డి, నల్లపోచమ్మ గల్లి యూత్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సదాశివపేటలో ఘనంగా గణనాథుడి నిమజ్జనం







**సదాశివపేట, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** సదాశివపేటలో శుక్రవారం గణేష్ నిమజ్జన వేడుకలు అంబరాన్నంటాయి. 11 రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథులకు భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. రంగురంగుల కాగితాలు, పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన వాహనాలపై విగ్రహాలను ఏర్పాటు చేసి కన్నులపండువగా శోభాయాత్ర నిర్వహించారు. దారి పొడవునా భజనలు, బ్యాండ్, డోలు, డప్పుల మోతతో సందడి నెలకొంది. 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యువత తీన్మార్ నృత్యాలు, మహిళల కోలాటాలు, చిన్నారుల కేరింతలతో శోభాయాత్ర వైభవంగా సాగింది. అనంతరం గణనాథులను చెరువులో నిమజ్జనం చేశారు.

ముందుగా గాంధీచౌక్‌లో పురపాలక సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ వెంకటేష్ తెలిపారు.

# ఘనంగా 'నమామి భారతం-వందేమాతరం' సామూహిక గానం



**కల్వకుర్తి, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** కల్వకుర్తి శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో విద్యాభారతి ఆధ్వర్యంలో 'నమామి భారతం-వందేమాతరం సామూహిక గానం' కార్యక్రమం నిర్వహించారు. దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షుడు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు ముఖ్య వక్తగా పాల్గొని వందేమాతరం గీత ప్రాశస్త్యం, దేశభక్తి, జాతీయ చైతన్యంలో దాని పాత్రను వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నమాల ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించారు. కార్యక్రమంలో పాఠశాల సమితి అధ్యక్షుడు టి.లక్ష్మారెడ్డి, డాక్టర్ వి.దామోదర్‌రెడ్డి, సాదు మురళీధర్‌రెడ్డి, కృష్ణమోహన్, కసిరెడ్డి నర్సిరెడ్డి, ప్రధానాచార్యుడు సేవకుల రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మూడు గ్రామాల్లో ఏకగ్రీవంగా కాంగ్రెస్ కమిటీల ఎన్నిక



**మల్లాపూర్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** మండలంలోని మల్లాపూర్, కొత్తూరు, వెలుగోముల గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు గౌస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. కొత్తూరు గ్రామ అధ్యక్షుడిగా అనుమగల సంజీవ, వెలుగోముల అధ్యక్షుడిగా గన్నోజ్ ప్రవీణ్ కుమార్, మల్లాపూర్ అధ్యక్షుడిగా సమ్మిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నూతన కమిటీలు కృషి చేయాలని కోరారు. గ్రామాల అభివృద్ధిలో కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అల్వాల్‌రెడ్డి, సాయిలు, బండారు కృష్ణయ్య, వల్లూరు రాజు, మాజీ ఎంపీటీసీ శివప్రసాద్, రమేష్, సత్యం గౌడ్, శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జస్టిస్ బి.చంద్రకుమార్‌ను కలిసిన ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్‌ను ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ చిరంజీవి, అంబేద్కర్ ఫూలే సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు రహీం, నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి గౌస్ చిస్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు, సామాజిక న్యాయం, అణగారిన వర్గాలు, మహిళల హక్కులపై చర్చించారు. సమాజంలో సమానత్వం, న్యాయం, హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా, సామాజిక సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు న్యాయం అందేలా నిరంతరం కృషి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# వినాయకునికి మహిళల మంగళహారతులు



**సదాశివపేట, సెప్టెంబర్ 25(జనంసాక్షి):** పట్టణంలోని శాస్త్రి రోడ్డులో శ్రీ రాఘవేంద్ర యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వినాయకునికి మంగళహారతులు ఇచ్చి, 51 రకాల స్వీట్లతో నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తి పాటలతో భజన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ రాఘవేంద్ర యూత్ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు భారీగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో పద్మావతి, మాధవి, లావణ్య, చంద్రకళ, లక్ష్మి, అక్షిత, తన్వి, సంధ్య, నందిని, రేఖ, లత, నిర్మల, పరిశుద్ధ, విజయ, వర్షిత తదితరులు పాల్గొన్నారు.

# చందంపేట చారిత్రాత్మక గడికోట పరిశీలన



**చిన్న శంకరంపేట్, సెప్టెంబర్ 25(జనంసాక్షి):** మండలంలోని చందంపేట గ్రామంలో చారిత్రాత్మక గడికోటను తాసిల్దార్ మాలతి పరిశీలించారు. పాపన్నపేట సంస్థాన రాణి చందమ్మ హయాంలో గడికోట నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# కన్నుల పండువగా ఆర్ఆర్ నగర్ గణేష్ శోభాయాత్ర



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** రామచంద్రారెడ్డి నగర్ (ఆర్ఆర్ నగర్)లో 11 రోజులుగా నిర్వహించిన గణేష్ ఉత్సవాలు శోభాయాత్రతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో నిర్వహించిన లడ్డూ వేలంలో మహిళల లడ్డూను కీర్తి రామకృష్ణారెడ్డి రూ.2.60 లక్షలకు, జనరల్ లడ్డూను ఆంజనేయరెడ్డి రూ.3.15 లక్షలకు దక్కించుకున్నారు. అనంతరం విజేతలు, దాతలను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్, మాజీ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, కార్యదర్శి విశ్వనాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

## సింగోటం వ్యవసాయ క్షేత్రంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు





**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి, దివంగత లక్ష్మారెడ్డి ఈ నెల 17న మృతి చెందారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సింగోటంలోని బీరం హర్షవర్ధన్ రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి, లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఆయన మృతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి, ఎస్ఎల్ఎన్ రమేష్, యూత్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, పెబ్బేరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యాపర్ల రామిరెడ్డి, లక్కాకుల సతీష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదోన్నతి బాధ్యతను మరింత పెంచుతుంది: జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు



**మల్దకల్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** జిల్లా పోలీస్ శాఖలో ఒక స్ఫూర్తి దాయక ఘటన చోటుచేసుకుంది. మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కె.గోపాల్ తమ కృషి, నిబద్ధతకు ప్రతి ఫలంగా ఏ.ఎస్సైగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్వయంగా పదోన్నతి పొందిన అధికారికి స్టార్స్ తొడిగి, అభినందనలు తెలియజేశారు.
జిల్లా ఎస్పీ మాట్లాడుతూఉద్యోగ జీవితంలో పదోన్నతి అనేది కేవలం పదవిలో ఎదుగుదల మాత్రమే కాకుండా, బాధ్యతలు మరింతగా పెరిగే దశగా భావించాలి అని అన్నారు. పదోన్నతి ద్వారా వ్యక్తిలో కొత్త ఉత్సాహం, మరింత నిబద్ధత, సేవాభావం పెరగాలని ఆయన సూచించారు. విధులను నిర్వర్తించే సమయంలో ఆరోగ్యాన్ని కూడా సమానంగా కాపాడుకోవాలని, శారీరక మరియు మానసికంగా దృఢంగా ఉండటం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని ఆయన వివరించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి పోలీసు సిబ్బంది ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.

# విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపునకు ప్రత్యేక శిక్షణ

- **స్టడీ స్కిల్స్, హ్యాండ్‌రైటింగ్‌పై అవగాహన**
- **మాన్వెరా అకాడమీ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**అచ్చంపేట, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, రాత నైపుణ్యాలను పెంపొందించేందుకు మాన్వెరా అకాడమీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా విద్యార్థులకు యాక్టివ్ రీకాల్, స్పేస్డ్ రిపిటిషన్, ఫర్గెటింగ్ కర్వ్, ఎర్రర్ చెకింగ్ వంటి ముఖ్యమైన అధ్యయన పద్ధతులపై అవగాహన కల్పించారు. చదివిన అంశాలను సులభంగా గుర్తుంచుకోవడం, సరైన సమయంలో పునశ్చరణ చేయడం, పరీక్షల్లో చేసిన తప్పులను గుర్తించి సరిదిద్దుకోవడం వంటి అంశాలను వివరించారు.
అదేవిధంగా శ్రీచక్రం ద్వారా ఏకాగ్రత సాధనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏకాగ్రతను పెంపొందించుకోవడం, మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం వంటి అంశాలపై పలు సూచనలు అందించారు.
పబ్లిక్ పరీక్షల్లో చక్కటి హ్యాండ్‌రైటింగ్ ప్రాధాన్యత, అక్షరాల స్పష్టత, రాతలో సమతుల్యత, జవాబులను క్రమబద్ధంగా ప్రజెంట్ చేయడం వంటి అంశాలపై కూడా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.
కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్టడీ స్కిల్స్ షీట్, శ్రీచక్ర షీట్, సపోర్టింగ్ షీట్, ఫ్లెయిర్ ఫైటర్ 0.7 ట్రయాంగిల్ పెన్ తదితర అవసరమైన మెటీరియల్స్‌ను అందించారు. మాన్వెరా కృష్ణారెడ్డి 23 సంవత్సరాల అనుభవంతో విద్యార్థులకు ఈ ప్రత్యేక శిక్షణను అందించారు.

# ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

- **జిల్లా అధ్యక్షకార్యదర్శులుగా నరేష్, జనార్ధన్**

**చేర్యాల, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా ఏఐఎస్ఎఫ్ ఐదవ మహాసభలు చేర్యాలలో నిర్వహించగా, ఈ మహాసభల్లో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తెలిపారు. నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రామగళ్ల నరేష్, జేరిపోతుల జనార్ధన్ ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షులుగా కనగండ్ల మల్లికార్జున్, బత్తుల రఘు, సహాయ కార్యదర్శులుగా వేల్పుల ప్రసన్నకుమార్, బరిగే భరత్, జిల్లా కోశాధికారిగా బత్తుల రంజిత్, జిల్లా గర్ల్స్ కన్వీనర్‌గా ఆకుల శిరీష, కో-కన్వీనర్లుగా ఉప్పరపల్లి పూజ, యశ్విత, అంబికలను ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు పుట్ట లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామగళ్ల నరేష్, జేరిపోతుల జనార్ధన్ మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్‌కు, జిల్లా నిర్మాణ బాధ్యతలు నిర్వహిస్తున్న మంద పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఏఐఎస్ఎఫ్ సంఘ నిర్మాణాన్ని విస్తరించి, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని, సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని విద్యార్థులు ఎదుర్కొంటున్నా సమస్యలను పరిష్కరించేందుకు దశలవారీగా ఉద్యమాలు నిర్వహిస్తామని నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామగళ్ల నరేష్, జేరిపోతుల జనార్ధన్ తెలిపారు.




# జాతీయస్థాయిలో జోగులాంబ గద్వాల జిల్లా ఖ్యాతి

- **ఉత్తమ నీటి నిర్వహణపై ప్రసంగించడం గొప్ప అవకాశం**
- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 25 (జనంసాక్షి);** ఉత్తమ నీటి నిర్వహణపై ఢిల్లీలో తనకు ప్రసంగించే అవకాశం లభించడంతో జాతీయస్థాయిలో జోగులాంబ గద్వాల జిల్లా ఖ్యాతి ఇనుమడించిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.
ఈ నెల 20-26వ తేదీ వరకు కేంద్ర జల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఇంటర్నేషనల్ వాటర్ వీక్ లో ఈనెల 24న కలెక్టర్ పాల్గొని వచ్చిన నేపథ్యంలో శుక్రవారం జిల్లా అధికార యంత్రాంగం తరపున పలువురు అధికారులు ఐడిఓసి లోని చాంబర్ లో జిల్లా కలెక్టర్‌ను సన్మానించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి వనరులను సంరక్షించుకునేందుకు ప్రణాళికలు రూపొందించడమే కాక వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసినప్పుడే అనుకున్న ఫలితాలు వస్తాయన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున ఉన్న నీటి వనరులను కాపాడుకునేందుకు ప్రజల భాగస్వామ్యంతో చిత్తశుద్ధితో పనిచేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, డిపిఓ శ్రీకాంత్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, జెడ్పి డిప్యూటీ సీఈవో నాగేంద్రం, డిఐఈఓ హృదయ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని అందించాలి

- **సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు రమేష్ నాయక్**



**ఉర్కొండ, సెప్టెంబర్ 25 (జనంసాక్షి);** మండలంలోని గుండ్లగుంటపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు రమేష్ నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు.
కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, మౌలిక వసతులు, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు.
ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నస్రీన్, ఉప సర్పంచ్ కొండల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాన్ని మరింత మెరుగ్గా నిర్వహించాలని సర్పంచ్ సూచించారు. బాలింతలకు మరియు గర్భిణీ స్త్రీలకు సరియైన నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని మెనూ ప్రకారంగా అందించాలని సూచించడం అయినది.
రోడ్లపై మురుగు నీరు అండర్ డ్రైనేజీలోకి ప్రతి ఒక్కరు కలుపుకోవాలని వర్షపు నీరును నిలవకుండా చూసుకోవాలని సూచించడం అయినది నీరు నిల్వ ఉండటం వల్ల దోమల వల్ల రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా గ్రామ ప్రజలకు తెలియజేయడమైనది.
అనంతరం సర్వే నెంబర్ 120లో ప్రభుత్వ ప్లాట్లు ఉన్నందున ప్లాట్ లను కొనడం గాని అమ్మడం గాని చేయకూడదు ఒకవేళ కొన్న అమ్మిన గ్రామపంచాయతీ పర్మిషన్ లేకుండా ఎవరు గానీ ఇల్లు కట్టుకోవడానికి కచ్చితంగా గ్రామపంచాయతీ పర్మిషన్ తీసుకోవాల్సిందే అని అన్నారు.

# విద్యాభివృద్ధికే అత్యధిక ప్రాధాన్యం

విద్యార్థుల వసతి కోసం రెండు హాస్టల్ బ్లాకుల నిర్మాణం చేపట్టామని, ఎస్సీ బాలురు, బాలికల హాస్టళ్లకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. పాలమూరు యూనివర్సిటీలో ఇంజినీరింగ్, లా కళాశాల భవనాల నిర్మాణం కొనసాగుతోందన్నారు. వీరన్నపేటలో రెండు మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయని, సుమారు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్‌తో ఉద్యోగ రంగంలో వేగంగా మార్పులు వస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు టెక్నికల్ ఎడ్యుకేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ అందించాల్సిన అవసరం ఉందన్నారు.
ఐటీఐలు, నైపుణ్య శిక్షణ కేంద్రాలు, టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో ఆధునిక శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.
విద్యపై పెట్టే పెట్టుబడి పిల్లల భవిష్యత్తుపై పెట్టుబడేనని, విద్యాసంస్థలను కేవలం భవనాలకే పరిమితం కాకుండా ఆధునిక విద్య, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్య శిక్షణకు కేంద్రాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.

# ప్రభుత్వ బడుల బలోపేతం.. ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలి



**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ (టీపీఎఫ్) డిమాండ్ చేసింది. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 18 శాతం నిధులు కేటాయించాలని కోరింది. విద్యా బస్సు యాత్రలో భాగం గా గురువారం రాత్రి తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో టీపీఎఫ్ ప్రతినిధులు స్థానికులతో కలిసి బడి నిద్ర చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఆకునూరి మురళి, ఎం.వి.రెడ్డి, ప్రొఫెసర్ పద్మజ తదితరులు మాట్లాడారు.
ఆకునూరి మురళి మాట్లాడుతూ మాతృభాషతోపాటు ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఆంగ్ల భాషా పరిజ్ఞానం కూడా అవసరమన్నారు. మెరుగైన మౌలిక వసతులు, ప్రత్యేక ఉపాధ్యాయులు, క్రీడా సదుపాయాలతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను విస్తరించాలని సూచించారు. ప్రతి మండలానికి మూడు పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేసి, విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పించాలని కోరారు. విద్యా వ్యవస్థను రాజకీయాలకు అతీతంగా బలోపేతం చేయాలని, సంస్కరణలతో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఎం.వి.రెడ్డి అన్నారు. ప్రస్తుత ఉపాధ్యాయుల ప్రమోషన్లకు ఎలాంటి ఆటంకం ఉండదని తెలిపారు. ప్రొఫెసర్ పద్మజ ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో కమ్యూనిటీ భాగస్వామ్యం గురించి వివరించారు. టీపీఎఫ్ సభ్యులు సృజనా యాదవ్, నిఖిల్ కృష్ణ, దళిత బహుజన్ ఫ్రంట్ అధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొని విద్యా హక్కుల కోసం సమైక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# ప్రశాంతంగా గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం నిర్వహించాలి






**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 25 (జనం సాక్షి):** గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా పోలీసులు అప్రమత్తంగా, సమన్వయంతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో బందోబస్తు సిబ్బందికి భద్రతా సూచనలు చేశారు. ప్రొజెక్టర్ ద్వారా శోభాయాత్ర, నిమజ్జన మార్గాలను వివరించారు.

**10 సెక్టార్లుగా బందోబస్తు...**

పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున బందోబస్తును 10 సెక్టార్లుగా విభజించినట్లు ఎస్పీ తెలిపారు. ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో సంయమనం పాటించాలని సూచించారు. ప్రజల రద్దీ దృష్ట్యా దొంగతనాల నివారణకు మఫ్టీ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**అనుమానాస్పద కదలికలపై నిఘా...**

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. స్ట్రైకింగ్ ఫోర్స్‌ను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. శోభాయాత్ర మార్గాల్లో సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంటుందని తెలిపారు. కొండారెడ్డిపల్లి చెరువు వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నారులు చెరువు వైపు వెళ్లకుండా పోలీసులు, నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ప్రజలకు భద్రతా సూచనలు...**

మైక్ ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు భద్రతా సూచనలు అందించాలని ఎస్పీ తెలిపారు. బువ్వమ్మ గుట్ట సమీపంలోని తాకీబాబా దర్గా ఉర్సు, శుక్రవారం ప్రార్థనల నేపథ్యంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని, వివిధ వర్గాల ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో సమన్వయంతో బందోబస్తు నిర్వహించాలని సూచించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్, డీఎస్పీలు ఏ.మహేష్, నల్లపు లింగయ్య, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి ఈశ్వరికి డీఈవో అభినందనలు



**నంగునూర్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** చైనాలో నిర్వహించనున్న ఆసియా గేమ్స్‌కు ఎంపికైన అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి బానోతు ఈశ్వరిని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ అభినందించారు. ఈ నెల 12 నుంచి 18 వరకు జరిగే పోటీల్లో ఈశ్వరి భారత్ తరఫున పాల్గొననుంది. ఈ సందర్భంగా డీఈవో రమేష్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి దేశానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణిస్తూ ఆసియా గేమ్స్‌కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మాదాసి రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, హెచ్‌డబ్ల్యూఓ మాధవీలత, ఉపాధ్యాయులు పాల్గొని ఈశ్వరికి శుభాకాంక్షలు తెలిపారు.

# బాలామృతం బాల్యదశకు ఎంతో ప్రయోజనకరం

- **జహీరాబాద్ ఇంచార్జ్ సీడీపీఓ సుశీల**



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** పోషణ మాసం సందర్భంగా హద్నూర్ అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జహీరాబాద్ ఇన్‌చార్జి సీడీపీవో లలిత, సెక్టార్ పర్యవేక్షకురాలు మంజుల మాట్లాడుతూ చిన్నారులకు బాలామృతం, చిరుధాన్యాలు, కూరగాయలు, గుడ్లు, పండ్లు, పాలు వంటి పోషకాహారం అందించాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సెప్టెంబర్ 9న ప్రారంభమైన పోషణ మాసం అక్టోబర్ 8 వరకు కొనసాగుతుందని తెలిపారు. పోషక విలువలు లేని చిరుతిళ్లకు, సెల్‌ఫోన్ వినియోగానికి పిల్లలను దూరంగా ఉంచాలని సూచించారు. ఆటలు, పాటల ద్వారా చిన్నారుల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించి అంగన్వాడీ కేంద్రాలకు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి, షహీన్ బేగం, ఇందిరమ్మ, మాణెమ్మ, సుగుణ, ఆశ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, ఉపసర్పంచ్ షబ్బీర్‌ఖాన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలు

- **సామూహిక గీతాలాపన**



**మక్తల్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** భారతదేశ స్వతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, జాతిని ఏకం చేసిన చారిత్రాత్మక వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని, మక్తల్ పట్టణంలో సామూహిక వందేమాతర గీతాలాపన కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు.

శ్రీ సరస్వతీ విద్యాపీఠం – అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో నమామి భారతం పేరుతో దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ విశిష్ట కార్యక్రమంలో భాగంగా మక్తల్ పట్టణంలోని పాత బజార్, శివాజీ నగర్ ప్రాంతంలో శివాజీ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సంపూర్ణ వందేమాతర గీతాలాపన చేపట్టారు. ఈ సందర్భంగా వందేమాతరం గేయంతో ప్రాంతమంతా దేశభక్తి భావంతో మార్మోగింది. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఈ గీతం అందించిన స్ఫూర్తిని వక్తలు ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో విద్యా భారతి సభ్యులు, శివాజీ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు పీఏసీఎస్ చైర్మన్ పరామర్శ



**బెజ్జంకి, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** బెజ్జంకి మండల కేంద్రంతో పాటు కల్లేపల్లి, బేగంపేట గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన లింగాల మల్లయ్య, బిగుల్ల ఎల్లయ్య, ఒగ్గు ఎల్లవ్వ, కొరివి రాజుకుమార్, మామిడాల చక్రపాణి, స్టీఫెన్ కుటుంబాలను పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్‌తో కలిసి పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. కల్లేపల్లిలో ఒగ్గు దామోదర్ యువసేన ఆధ్వర్యంలో బిగుల్ల ఎల్లయ్య కుటుంబానికి 50 కిలోల బియ్యం అందించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో బేగంపేట సర్పంచ్ ఎల విజయ, ఉపసర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, పార్టీ నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం దిశగా అడుగులు

## సెప్టెంబర్ 29న వనపర్తిలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాట్రోత్ హుస్సేన్ నాయక్ పర్యటన




**వనపర్తి, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** జిల్లాలో దశాబ్దాలుగా పరిష్కారం కాకుండా ఉన్న భూ సమస్యలు, పట్టాల సమస్యలు, భూసేకరణ పరిహారం, విద్యార్థుల స్కాలర్‌షిప్ సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవి నాయక్ తెలిపారు. శుక్రవారం వనపర్తి జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కమ్మతాడ, వనిగితాడ, లటేమల్లితాడ తదితర ప్రాంతాల్లో సుమారు 463 ఎకరాల భూమిని 80 ఏళ్లుగా స్థానికులు సాగు చేసుకుంటున్నప్పటికీ పట్టాలు, భూ హక్కులకు శాశ్వత పరిష్కారం లభించలేదని రవి నాయక్ తెలిపారు. ఈ సమస్యపై జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాట్రోత్ హుస్సేన్ నాయక్‌కు గతంలో మెమోరాండం సమర్పించామని, దాని మేరకు సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆయన సెప్టెంబర్ 29న ఆయా ప్రాంతాలను సందర్శించనున్నారని చెప్పారు.

అదేవిధంగా వనపర్తి మెడికల్ కాలేజీ సమీపంలోని పెద్దగూడెం తండాలో సుమారు 73 ఏళ్లుగా కొనసాగుతున్న భూ సమస్యతో పాటు గన్‌పూర్ ప్రాంతంలోని భూ సమస్యలను కూడా కమిషన్ సభ్యుడి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

భూముల హక్కులు, వివాదాలు, భూసేకరణ పరిహారం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

భూ సమస్యలతో పాటు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందకపోవడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పై చదువులు కొనసాగించలేకపోవడం వంటి సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. దశాబ్దాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా కృషి చేస్తామని రవి నాయక్ పేర్కొన్నారు.

ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు రెడ్యా నాయక్, గిరిజన మోర్చా నాయకులు తిరుపతి, లక్ష్మణ్, వసిరాం నాయక్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇనోల్ బాలికల గురుకుల కళాశాలలో MPC సీట్లు ఖాళీ

- **ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం**
- **26 వరకు దరఖాస్తుల స్వీకరణ.. ST విద్యార్థినులకు ప్రాధాన్యత**

**అచ్చంపేట, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** అచ్చంపేట మండలం ఇనోల్‌లోని TGTWURJC (PvTG-G) బాలికల గురుకుల కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ MPC మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హత కలిగిన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తెలిపారు.

MPC గ్రూపులో చేరేందుకు ఆసక్తి ఉన్న అర్హత కలిగిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 26, 2026 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న సీట్లను నిబంధనల ప్రకారం భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

**ST విద్యార్థినులకు ప్రాధాన్యత...**

ప్రవేశాల ప్రక్రియలో ST విద్యార్థినులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు అవసరమైన ధ్రువ పత్రాలతో కళాశాల కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు సంప్రదించండి: 8333925372

**కళాశాల:** TGTWURJC (PvTG-G), ఐఇనోల్ బాలికల గురుకుల కళాశాలలో MPC సీట్లు ఖాళీ

ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం.



26 వరకు దరఖాస్తుల స్వీకరణ.. ST విద్యార్థినులకు ప్రాధాన్యత

**అచ్చంపేట:** అచ్చంపేట మండలం ఐనోల్‌లోని TGTWURJC (PvTG-G) బాలికల గురుకుల కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ MPC మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హత కలిగిన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తెలిపారు.
MPC గ్రూపులో చేరేందుకు ఆసక్తి ఉన్న అర్హత కలిగిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 26, 2026 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న సీట్లను నిబంధనల ప్రకారం భర్తీ చేయనున్నట్లు తెలిపారు.
**ST విద్యార్థినులకు ప్రాధాన్యత...**
ప్రవేశాల ప్రక్రియలో ST విద్యార్థినులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు అవసరమైన ధ్రువ పత్రాలతో కళాశాల కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు సంప్రదించండి: 8333925372

## ఐడీఓసీ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): నూతనంగా నిర్మిస్తున్న ఐడీఓసీ సముదాయ భవన పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. శుక్రవారం భవనాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ కలెక్టర్ ఛాంబర్, మినిస్టర్ ఛాంబర్, మీటింగ్ హాల్‌లను పరిశీలించారు. మీటింగ్ హాల్‌లో ప్రొజెక్టర్ ఏర్పాటుపై అధికారులకు సూచనలు చేశారు. కాన్ఫరెన్స్ హాల్‌లో వీడియో కాన్ఫరెన్స్ కోసం టీవీ ఏర్పాటు వివరాలను అడిగి తెలుసుకున్నారు. భవనం వెలుపల హార్టికల్చర్, గ్రీనరీ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ వెంకటరమణ, డీఈ రాములు అధికారులు పాల్గొన్నారు.

## వందేమాతరం గేయం దేశ ప్రజలకు స్ఫూర్తి: ఎంపీ డీకే అరుణ

నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): వందేమాతరం గేయం దేశ ప్రజలకు స్ఫూర్తినిస్తుందని పాలమూరు ఎంపీ డీకే అరుణ అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సెంట్రల్ చౌక్‌లో నిర్వహించిన వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలతో కలిసి గీతాన్ని ఆలపించారు.
ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బంకిం చంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గేయం స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజల్లో దేశభక్తిని రగిలించిందన్నారు. దేశ సామాజిక, సాంస్కృతిక విలువలకు ప్రతీకగా నిలిచిన ఈ గేయాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశవ్యాప్తంగా సామూహిక గీతాలాపన నిర్వహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. వందేమాతరం రచనకు 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భారీ సంఖ్యలో ప్రజలు ఒకేసారి గీతాన్ని ఆలపించడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. సామూహిక గీతాలాపన దేశభక్తి, ఐక్యతా భావాన్ని పెంపొందిస్తుందని తెలిపారు.

**గణేష్ శోభాయాత్రలో పాల్గొన్న ఎంపీ...**

అనంతరం నారాయణపేట పట్టణంలో జరిగిన గణేష్ నిమజ్జన శోభాయాత్రలో డీకే అరుణ పాల్గొని వివిధ అలంకరణలతో తరలివచ్చిన గణేష్ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రతంగ్ పాండురెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ కన్వీనర్ దోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సత్యయాదవ్, పగడాకుల శ్రీనివాస్, న్యాయవాదులు రఘువీర్‌యాదవ్, నందు నామాజీ, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత సత్యయాదవ్, వైస్ చైర్‌పర్సన్ మంజుల జి.ఆర్.రెడ్డి, రఘురామయ్య గౌడ్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## డ్రై డే పకడ్బందీగా.. వైద్య సేవలు నాణ్యంగా

- అధికారులకు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశాలు







వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమరచింత మున్సిపాలిటీలో నిర్వహించిన డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, మున్సిపల్, వైద్య సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం అమరచింత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన వైద్య సేవలను పరిశీలించారు. రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో అమరచింత, ఆత్మకూరు మండలాల సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు నిర్వహించిన వీజీపీపీ శిక్షణలో పాల్గొన్న అదనపు కలెక్టర్ గ్రామాభివృద్ధి పనులు, ఫామ్ పాండ్ల నిర్మాణం, జీవనోపాధి కార్యక్రమాలను నిబంధనల మేరకు చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుదలకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని తెలిపారు. అనంతరం 'స్వచ్ఛత హి సేవ' ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజనీర్ నూతన భవనం ప్రారంభం



తాడూరు, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): తాడూరు మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజనీర్ నూతన భవనాన్ని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం నిర్మించిన నూతన కార్యాలయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యాలయం అందుబాటులోకి రావడంతో గృహ నిర్మాణానికి సంబంధించిన సేవలు ప్రజలకు మరింత సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి వినోద్, తాడూరు మండల అధ్యక్షుడు యార రమేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల ఆరోగ్యమే మన బాధ్యత

### ఓల్డ్ ఏజ్ హోమ్‌లో హెల్త్ క్యాంపు.. వైద్య పరీక్షలు, మందుల పంపిణీ



వనపర్తి, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): వయోవృద్ధుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా సంక్షేమ అధికారి కే. సుధారాణి సూచించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వనపర్తిలోని శ్రీ చౌడేశ్వరి ఓల్డ్ ఏజ్ హోమ్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సమన్వయంతో హెల్త్ క్యాంపు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఓల్డ్ ఏజ్ హోమ్‌లో నివసిస్తున్న వయోవృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అవసరమైన వారికి వైద్య సలహాలు అందించడంతో పాటు మందులు పంపిణీ చేశారు. వయోవృద్ధుల్లో తలెత్తే ఆరోగ్య సమస్యలను సకాలంలో గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని సుధారాణి సూచించారు.
వయోవృద్ధులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ గౌరవం, ఆదరణతో చూసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొని వయోవృద్ధులకు వివిధ సేవలు అందించారు. అనంతరం వయోవృద్ధుల పట్ల గౌరవం, ఆదరణ, సేవా భావంతో వ్యవహరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు, ఓల్డ్ ఏజ్ హోమ్ సిబ్బంది, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

## డా. బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాలకు ఈ నెల 30 చివరి గడువు



నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పాలెంలోని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయంప్రతిపత్తి) లో కొనసాగుతున్న డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ (సెంటర్ కోడ్: 241) ద్వారా 2026--27 విద్యా సంవత్సరానికి నిర్వహిస్తున్న డిగ్రీ ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీ చివరి గడువు అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రాములు, స్టడీ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ వర్కాల శ్రీనివాసులు బుధవారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బి.ఏ., బి.కాం., బి.ఎస్సీ. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అందిస్తున్న ఈ కోర్సులు రెగ్యులర్ డిగ్రీతో సమాన గుర్తింపు కలిగి ఉండటంతో విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించే మంచి అవకాశంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగులు, గృహిణులు, వివిధ కారణాలతో మధ్యలో చదువును నిలిపివేసిన వారు, ఉద్యోగంతో పాటు డిగ్రీ పూర్తి చేయాలనుకునే వారు, అలాగే ఉన్నత విద్యను కొనసాగించాలని ఆశించే ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
విద్యతో పాటు ఉపాధిని కొనసాగించాలనుకునే వారికి ఓపెన్ యూనివర్సిటీ విధానం ఎంతో అనుకూలంగా ఉంటుందని వివరించారు. ప్రవేశాల కోసం 10వ తరగతి మెమో, ఇంటర్మీడియట్ లేదా ఐటీఐ మెమో, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. కోర్సుల వివరాలు, అర్హతలు, ప్రవేశ విధానం, ఫీజు నిర్మాణం మరియు ఇతర పూర్తి సమాచారం కోసం స్టడీ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ వర్కాల శ్రీనివాసులును 7780340678 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. అలాగే పాలెంలోని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఉన్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌ను నేరుగా సంప్రదించి ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకొని వెంటనే నమోదు చేసుకోవాలని అభ్యర్థులకు విజ్ఞప్తి చేశారు.

## రూ.1,15,001/- పలికిన ఆర్ వి రెసిడెన్సీ గణనాథుడి లడ్డు...

- దక్కించుకున్న కే.రమ్య శ్రీనివాస్ రెడ్డి కుటుంబం



అమీన్పూర్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): అమీన్‌పూర్‌లోని జాకీ క్లాసిక్ ఆర్ వి రెసిడెన్సిలోని గణనాథుడి లడ్డు రూ.1,15,001/- ధర పలికింది. కాలనీకి చెందిన కె రమ్య శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు వేలంపాటలో పోటీపడి లడ్డుని కైవసం చేసుకున్నారు. తమ కాలనీలో మొదటిసారి జరిగిన వినాయక నవరాత్రి ఉత్సవాలలో లడ్డును కైవసం చేసుకోవడం ఎంతో సంతృప్తిగా ఉందని అన్నారు. ఆ వినాయకుడి ఆశీస్సులతో జాకీ క్లాసిక్ ఆర్ వి రెసిడెన్సి వాసులందరూ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో నిలసిల్లాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## పాలాది హైందవి నేత్రదానం ఆదర్శనీయం: రెడ్ క్రాస్ చైర్మన్ ఎల్.ఎన్. అంబటి నటరాజ్



జడ్చర్ల, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): మరణించినా మరొకరికి చూపునివ్వవచ్చని నిరూపిస్తూ జడ్చర్లకు చెందిన పాలాది హైందవి నేత్రదానంతో ఇద్దరికి చూపు ప్రసాదించి ఆమె తల్లిదండ్రులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పాలాది సారిక రామ్మోహన్ దంపతులు ఆదర్శంగా నిలిచారని రెడ్ క్రాస్ చైర్మన్ ఎల్.ఎన్. అంబటి నటరాజ్ తెలిపారు. పాలాది హైందవి ఆకస్మిక మరణంతో తీవ్ర దుఃఖంలో ఉన్నప్పటికీ, హైందవి కళ్ళు ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆమె తల్లిదండ్రులు, ఎల్.ఎన్. శరత్ చంద్ర, వాసుల సహకారంతో రెడ్ రెడ్ క్రాస్ కు శుక్రవారం సమాచారం ఇచ్చారు. స్పందించిన చైర్మన్ నటరాజ్, ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ శివ హైందవి భౌతికకాయం నుండి కార్నియాను సేకరించి, కుటుంబ సభ్యులకు ధృవీకరణ పత్రం అందజేశారు.
ఇప్పటివరకు రెడ్ క్రాస్ ద్వారా 276 మంది కార్నియా దానం చేయడం వల్ల 552 మందికి చూపు లభించిందని నటరాజ్ తెలిపారు. దుఃఖంలోనూ నేత్రదానానికి ముందుకు వచ్చిన హైందవి కుటుంబానికి రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్ ఆఫ్ జడ్చర్ల, లయన్స్ క్లబ్ ఆఫ్ పాలమూరు తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.

# పాఠశాలలు, పీహెచ్‌సీని తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి







నవాబుపేట, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): మండల ప్రత్యేక అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.సునీత శుక్రవారం నవాబుపేట మండలంలోని పలు ప్రభుత్వ సంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. బోధన నాణ్యత, కంప్యూటర్ విద్య, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు పట్టిక, పాఠశాల రికార్డులను పరిశీలించారు.
తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన సునీత.. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోజువారీ ఓపీ నమోదు, మందుల లభ్యత, కొరత వంటి అంశాలపై మెడికల్ ఆఫీసర్, సిబ్బందితో చర్చించారు. సిబ్బంది హాజరును పరిశీలించి విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు.
అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. వసతి గృహంలోని సౌకర్యాలు, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థినులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతను తెలుసుకునేందుకు వారితో కలిసి కింద కూర్చొని భోజనం చేశారు. భోజనం నాణ్యంగా ఉందని పేర్కొంటూ ఇదే ప్రమాణాలను నిరంతరం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.
ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేయాలని, ప్రజలు, విద్యార్థులకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సునీత సూచించారు. తనిఖీల్లో ఎంపీడీవో, ఎంఈవో, ఎంపీవో, మెడికల్ ఆఫీసర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా యూబీఐ 46వ వ్యవస్థాపక దినోత్సవం



మల్దకల్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మల్దకల్ శాఖ 46వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎ.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రాంత ప్రజల ఆర్థిక అభివృద్ధికి బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరిస్తామని తెలిపారు. 1980 సెప్టెంబర్ 25న ప్రారంభమైన శాఖ 46 ఏళ్లుగా నాణ్యమైన సేవలతో ప్రజల విశ్వాసాన్ని పొందిందన్నారు. ప్రస్తుతం శాఖలో రూ.38 కోట్లకు పైగా డిపాజిట్లు, రూ.116 కోట్లకు పైగా రుణాలు ఉన్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావుతో కలిసి మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.2 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం శ్రీనివాస్, మేనేజర్ నరేష్ యాదవ్, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ: ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



తాడూర్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): ఈ రోజు తాడూర్ మండలంలోని ఎంపిడివో కార్యాలయంలో మండలానికి సంబంధించిన కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన నాగర్ కర్నూల్ నియోజకవర్గ శాసనసభ్యులు డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి. ఈ కార్యక్రమం అనంతరం మాట్లాడుతూ పేద ఆడబిడ్డ పెళ్లికి రేవంతన్న కానుకగా ఒక లక్ష నూట పదహారు రూపాయలు పేదవాడికి ఎంతో సహాయంగా ఉపయోగపడుతుందని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ రామచంద్ర రెడ్డి మరియు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి వినోద్ కుమార్ మరియు తాడూరు సర్పంచ్ సంద మల్లయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు యార రమేష్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చిక్కొండ్ర మల్లేష్ , మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు

## పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు



చేర్యాల, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): చేర్యాల మున్సిపాలిటీ 12వ వార్డుకు చెందిన శనిగారి బాలయ్య ఇల్లు ఇటీవల కూలిపోవడంతో ఆయన కుటుంబాన్ని కౌన్సిలర్ షరీఫా బేగం ఖాజా పరామర్శించారు. విషయం ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రెండో విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. శుక్రవారం బాధిత కుటుంబానికి మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ 12వ వార్డులో 38 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. పేదల సంక్షేమం, వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. 'సేవే మార్గం.. ప్రేమే లక్ష్యం'తో ముందుకు సాగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పచ్చిమడ్ల వెంకటయ్య, శనిగారి బిక్షపతి, తుమ్మలపల్లి సంతోష్, ఎండి నవాజ్, జహీరుద్దీన్ పాల్గొన్నారు.

## సేవా సంకల్ప్‌లో విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం





కొల్చారం, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): కిష్టాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో, మండల అధ్యక్షుడు పంతులు హరీష్ నేతృత్వంలో 'సేవా సంకల్ప్' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించి ప్రతిభను ప్రోత్సహించారు. దేశభక్తి, సామాజిక బాధ్యత, సృజనాత్మకత, ప్రసంగ నైపుణ్యాలను పెంపొందించేందుకు పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. చిత్రలేఖనంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎంచర్ల శేఖర్‌యాదవ్, పంతులు హరీష్ బహుమతులు అందజేశారు. గ్రామీణ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న ఊశయ్య, బీజేవైఎం నాయకుడు ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అసంపూర్తి పనులతో దెబ్బతింటున్న చెరువు కట్ట



చేర్యాల, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): చేర్యాల పెద్ద చెరువు కట్ట సుందరీకరణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో వర్షాలకు కట్ట దెబ్బతింటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుందరీకరణలో భాగంగా ఇరువైపులా సిమెంట్ బీములు ఏర్పాటు చేసినా, మట్టి చదును చేయకపోవడంతో వర్షపు నీరు కట్టను కోసుకుంటూ బీముల కింద నుంచి ప్రవహిస్తోంది. దీంతో కట్ట బలహీనమై ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. పనులను వెంటనే పూర్తి చేయాలని, భారీ వర్షాల సమయంలో కట్టకు ముప్పు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కట్టపై నుంచి భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు. కట్టకు ప్రమాదం జరిగితే దిగువన ఉన్న చేర్యాల పట్టణ ప్రజలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు.

# వరి పొలంలో పొలం బడి కార్యక్రమం

- పోతిరెడ్డిపల్లి గ్రామంలో వరి పంటపై రైతులకు అవగాహన
- మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి





కొల్చారం, సెప్టెంబర్ 25(జనంసాక్షి): కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో రైతు పొలంలో పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి తెలిపారు. వరి పంటలో ప్రస్తుతం కనిపించే కంకి నల్లి, బ్రౌన్ ప్లాంట్ హాపర్, అగ్గి తెగులు నివారణ చర్యలతో పాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ అధికారులు వరి పొలాన్ని పరిశీలించి, మొక్కల పెరుగుదల, పురుగులు మరియు తెగుళ్ల పరిస్థితిని రైతులతో కలిసి గమనించారు. కంకి నల్లి వల్ల కంకులు మరియు గింజలకు కలిగే నష్టం, దాని ప్రారంభ లక్షణాలు మరియు నివారణ చర్యలను వివరించారు.
అదేవిధంగా (బ్రౌన్ ప్లాంట్ హాపర్) పురుగు మొక్కల అడుగు భాగంలో చేరి రసం పీల్చడం వల్ల మొక్కలు ఎండిపోయే అవకాశం ఉందని తెలిపారు. అధిక నత్రజని ఎరువుల వినియోగాన్ని తగ్గించి, పొలాన్ని తరచుగా పరిశీలించాలని సూచించారు.
అగ్గి తెగులు లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి, పొలంలో అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. అనవసరంగా పురుగుమందులు, శిలీంద్రనాశకాలు వాడకుండా వ్యవసాయ శాఖ సిఫారసుల మేరకు మాత్రమే వినియోగించాలని తెలిపారు.ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పొలం బడి కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాధాన్యతను కూడా రైతులకు వివరించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడటం, జీవ వైవిధ్యాన్ని పెంపొందించడం, స్థానికంగా లభించే సహజ వనరులను సద్వినియోగం చేసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.రైతులు జీవామృతం, ఘన జీవామృతం, వేప ఆధారిత సహజ ద్రావణాలు వంటి పద్ధతులను పరిస్థితులకు అనుగుణంగా ఉపయోగించుకోవాలని సూచించారు. పంటలో పురుగు--తెగుళ్లను నిరంతరం గమనిస్తూ సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి తెలిపారు.

## అతివేగంతో పల్టీ కొట్టిన బులెరో..!

- గేదె మృతి, పలువురుకి తప్పిన ప్రమాదం



న్యాల్‌కల్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి): బులెరో వాహన చోదకుడు అతివేగం, జాగ్రత్తతో.. వేగంగా దూసుకు పోవడంతో ఓ బులెరో వాహనం అదుపుతప్పి ఓ చక్రం ఊడి పల్టీ కొట్టిన సంఘటన న్యాల్ కల్ మండలం, ఇబ్రహీంపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఘటనాస్థలిలో స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా, బాన్సువాడ నుండి టీఎస్ 17, టీ 9327 నెంబర్ గల బులెరో వాహనంలో 5 గేదెలతో జహీరాబాద్ లోని అల్లాన కర్మాగారానికి బయలుదేరింది. శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని ఇబ్రహీంపూర్, చినిగేపల్లి గ్రామ కూడలి సమీపంలో వాహనం చక్రం ఒడి పల్టీ కొట్టింది. దీంతో వాహనంలోని ఓ గేదె అక్కడికక్కడే మృతి చెందగా.. వాహనంలో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. అనునిత్యం ప్రధానంగా తెల్లవారుజామున, మధ్యాహ్న భోజన సమయంలో పదుల సంఖ్యలో వాహనాలు అతివేగంగా అజాగ్రత్తగా రాకపోకలు సాగిస్తాయని, తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు స్థానికులు వాపోయారు.

## స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం

**ఆత్మకూర్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యమని అసిస్టెంట్ కలెక్టర్ (లోకల్ బాడీస్) కిమ్యా నాయక్ అన్నారు. శుక్రవారం ఆత్మకూర్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో పాల్గొని సిబ్బంది, ప్రజాప్రతినిధులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చెత్తను మూలాల వద్దే తడి, పొడి, హానికర, సానిటరీ వ్యర్థాలుగా నాలుగు రకాలుగా వేరు చేయాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో అమరచింత, ఆత్మకూర్ ఎంపీడీవోలు శ్రీనివాసులు, శ్రీరాంరెడ్డి, సర్పంచ్‌లు, ఎస్‌బీఎం కన్సల్టెంట్, ఏపీవోలు, ఈసీలు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## గోపాలపేటలో వివాహిత అదృశ్యం

### భర్త ఫిర్యాదు.. వ్యక్తిపై అనుమానం

**గోపాలపేట, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** మండలంలోని బుద్దారం జాంప్ల తండాకు చెందిన ఆంగోత్ ఝాన్సీ (32) అదృశ్యమైన ఘటనపై భర్త ఆంగోత్ రవి గోపాలపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 21న ఉదయం రాయంపేట దర్గాకు వెళ్లిన రవి మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చేసరికి భార్య కనిపించలేదని తెలిపాడు. ఆమె మొబైల్ ఫోన్ ఇంట్లోనే ఉండటంతో చుట్టుపక్కల విచారించగా ఆటోలో వెళ్లినట్లు తెలిసిందన్నారు. బంధువులు, పరిచయస్తుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. నందిమల్లగడ్డకు చెందిన సత్యనారాయణపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు తెలిపాడు. ఝాన్సీ పింక్ రంగు చీర, జాకెట్ ధరించి ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు గోపాలపేట పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## ఘనంగా పి.ప్రహ్లాదరావు జన్మదిన వేడుకలు



**మల్దకల్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** మల్దకల్ ఆదిశిలా క్షేత్రంలోని శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ వ్యవస్థాపక వంశీయులు పి.ప్రహ్లాదరావు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు గద్దం కృష్ణారెడ్డి దంపతులు, శేషంపల్లి తిమ్మారెడ్డి, సీతారాంరెడ్డి, సర్పంచ్ చిట్టెమ్మ గోపాలు, ఈవో పురేందర్ తదితరులు ప్రహ్లాదరావును పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, వికాస తరంగిణి ప్రతినిధులు, కళాకారులు, ఆలయ సిబ్బంది, వాల్మీకి పూజారులు పాల్గొన్నారు.

## రూ.3 లక్షలు పలికిన బీరంగూడ గుట్ట వినాయకుడి లడ్డూ



**బీరంగూడ, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** బీరంగూడ గుట్ట శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని గురువారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. నిమజ్జనానికి ముందు నిర్వహించిన లడ్డూ వేలంపాటలో బీరంగూడకు చెందిన పెద్ద లక్ష్మణ్ రూ.3 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం ఐదు వెండి నాణ్యాలకు నిర్వహించిన వేలంపాటలో శ్రీకాంత్ (సుల్తాన్‌పూర్) రూ.70 వేలు, రాజు (ఎన్ఆర్ఐ కాలనీ) రూ.58 వేలు, వికాస్ (లక్ష్మణ్) రూ.42 వేలు, సుజయ్ (కేఎస్‌జీ) రూ.60 వేలు, రాజు (ఉస్మే బావి తోట) రూ.46 వేలకు సిల్వర్ కాయిన్లను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. 11 రోజుల పాటు వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించామని తెలిపారు. గత 15 సంవత్సరాలుగా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని, ప్రతి ఏటా లడ్డూ వేలంపాటలో పాల్గొనే భక్తుల సంఖ్య పెరుగుతోందన్నారు. లడ్డూను దక్కించుకున్న వారికి విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. వెండి నాణ్యాల వేలంపాటలోనూ భక్తులు పోటాపోటీగా పాల్గొంటున్నారని తెలిపారు. నిమజ్జన ఊరేగింపు సందర్భంగా వివిధ కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

# డిజిటల్ రీ-సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్25 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో భూ వివాదాల పరిష్కారం, భూ రికార్డుల ఆధునీకరణ లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ రీ-సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ ప్రియాంక శుక్రవారం ఉట్కూర్ మండలం వెంకటాపూర్ రెవెన్యూ గ్రామంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం భూ భారతి' పోర్టల్ ద్వారా సర్వే మ్యాప్‌తో పాటు ప్రత్యేక భూధార్ నంబర్ ఆధారంగా శాశ్వత భూ హక్కుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపడుతోందని తెలిపారు.మొదటి విడతలో వెంకటాపూర్ రెవెన్యూ గ్రామంలోని 45 సర్వే నంబర్ల పరిధిలో 646.39 ఎకరాల్లో రెవెన్యూ రీ--సర్వే నిర్వహించనున్నట్లు వెల్లడించారు.రైతులు వాస్తవంగా అనుభవిస్తున్న భూమి విస్తీర్ణం ఆధారంగా సమగ్రంగా సర్వే నిర్వహిస్తామని తెలిపారు.ముందుగా గ్రామం మొత్తం సరిహద్దులను (విలేజ్ బౌండరీ) గుర్తించి, అనంతరం గ్రామకంఠం సరిహద్దులు, ప్రభుత్వ భూములకు సంబంధించిన సర్వే నంబర్లు, ప్రభుత్వ భూముల్లో రైతుల వారీగా ఉన్న పొజిషన్, ఆ తర్వాత పట్టా భూముల్లో రైతుల వారీగా సర్వే నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు.రీ--సర్వే ప్రక్రియ ప్రారంభానికి ముందు గ్రామసభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని, అనంతరం గ్రామంలో టామ్‌టామ్ ద్వారా సమాచారం అందించి, నిర్ణీత ప్రకారం రీ--సర్వే ప్రక్రియను చేపడతామని తెలిపారు.రైతులు, ప్రజలు రీ--సర్వే ప్రక్రియకు సహకరించి తమ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం లో తహసిల్దార్ అశోక్ కుమార్, సర్వేయర్ జయ శంకర్, సర్వేయర్లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దుస్తులు, షూస్ పంపిణీ



**గుండుమాల్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** బోగారం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, షూస్, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం సర్పంచ్ శేఖర్‌గౌడ్, ప్రధానోపాధ్యాయురాలు వినోదమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫాం, షూస్ అందిస్తూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అవసరమైన వస్తువులు అందించడం ద్వారా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాయప్ప, పంచాయతీ కార్యదర్శి అచ్చన్న, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జర్నలిస్టును పరామర్శించిన మాజీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్

**అల్లాదుర్గం, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది కోలుకుంటున్న మండల సాక్షివిలేకరి సీనియర్ పాత్రికేయులు మజ్జిగ వీరేందర్ ను శుక్రవారం మాజీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి పరామర్శించి అధైర్య పడవద్దని ధైర్యం చెప్పారు. ఆయన వెంట బి ,ఆర్, ఎస్ నాయకులు మోహన్ రాథోడ్ , సాయికుమార్ తదితరులున్నారు.

## మాలల హక్కుల సాధనకు చలో ఉస్మానియా



**జడ్చర్ల, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** రోస్టర్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 4న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే 'చలో ఉస్మానియా' మహా ధర్నాను విజయవంతం చేయాలని మాల మహానాడు నాయకుడు పెరుమాళ్ల జంగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం జడ్చర్ల ఎంపీపీ కార్యాలయం వద్ద పూలే విగ్రహం ముందు మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో రోస్టర్ విధానం అమలు చేయకపోవడం వల్ల మాల నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వాల వైఖరికి నిరసనగా నిర్వహించే మహాధర్నాకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి మాలలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు పండుగ భాను, రాహుల్, నామ సైదులు, అరుణ్, నందన్, అనిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పల్లెకు తండాకు మెరుగైన రహదారులు



**కొత్తపల్లి, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** కొత్తపల్లి మండలంలోని పల్లెలు, తండాలు, గ్రామాలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గొర్లలోని భాయ్ నుంచి ఇంజమూరు మీదుగా దుప్పటి గట్టు తండా, భోజ్యానాయక్ తండా వరకు రహదారి అభివృద్ధి పనులకు రూ.6.08 కోట్లు మంజూరయ్యాయి. నిధులు మంజూరు కావడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రహదారి నిర్మాణంతో ప్రజల రాకపోకలు, రైతుల పంటల రవాణా మరింత సులభతరం కానుంది. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోట్ల మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రమేష్‌రెడ్డి, గుడ్లోని భాయ్ సర్పంచ్ హరిత కృష్ణ, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

# సిద్ధి వినాయకుడి ఘన నిమజ్జనోత్సవం

- హంగూ ఆర్భాటాలకు దూరంగా.. సాంప్రదాయ పద్ధతిలో నిమజ్జనం

**గుమ్మడిదల, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** గుమ్మడిదల మండల కేంద్రంలోని సిద్ధి వినాయక సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడి నిమజ్జనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. హంగూ ఆర్భాటాలకు దూరంగా, సాంప్రదాయ పద్ధతిలో ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని ఎర్రచెరువులో గణనాథుడిని నిమజ్జనం చేశారు. నిమజ్జనానికి ముందు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. భక్తుల గణపతి నామస్మరణల మధ్య నిమజ్జన కార్యక్రమం కొనసాగింది. నిమజ్జనోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేసిన మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులకు, కార్యక్రమానికి సహకరించిన పోలీస్ శాఖ సిబ్బందికి సిద్ధి వినాయక సంఘం సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిద్ధి వినాయక సంఘం సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





## సేవా సంకల్ప్ అభియాన్‌లో ఎంపీ డీకే అరుణ



**నవాబుపేట, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** నవాబుపేట మండల కేంద్రంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. స్థానిక సర్పంచ్ గీతారాణి సుధాకర్‌చారి మండలంలోని పలు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ అనంతపద్మనాభ స్వామి వ్రతం



**మల్దకల్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ అనంతపద్మనాభ స్వామి వ్రతాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక వంశీయులు పట్వారి ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు మధుసూదనాచారి, రమేష్‌చారి, రవి, వాల్మీకి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి తోర పూజ అనంతరం భక్తులకు తోరాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. గిరీశాచల ట్రస్టు ఆధ్వర్యంలో హార్మోనిస్టు రాఘవేంద్రచారి నేతృత్వంలో భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర రావు, అరవింద్‌రావు, శశాంక్, సీతారాం రెడ్డి, రామచంద్రారెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్.. ఒకరు మృతి



**గద్వాల, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని నదీఅగ్రహారం రోడ్డులో బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. చింతలపేటకు చెందిన మునగాల శీను (54) అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనతో పాటు ప్రయాణిస్తున్న ఈశ్వరన్నకు తీవ్ర గాయాలయ్యాయి. నదీఅగ్రహారం నుంచి గద్వాల వైపు వస్తుండగా ప్రమాదం జరిగినట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన ఈశ్వరన్నను అత్యవసర చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. శీను మృతితో చింతలపేటలో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు.

## ఘనంగా ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమం




**మల్దకల్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారంపర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, దానిని పెంచి సంరక్షించాలని కార్యక్రమ నిర్వాహకులు సూచించారు.ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ,వాతావరణ సమతుల్యత, పచ్చదనం ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా, వాటిని నిరంతరం సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.మండల విద్యాధికారి జి.సురేష్ మాట్లాడుతూ,పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వామ్యం చేయడం ద్వారా చిన్న వయసు నుంచే ప్రకృతి పట్ల బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందించవచ్చన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి హెడ్‌మాస్టర్ రాజేశ్వర్ రెడ్డి,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలి





**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** ఎల్‌నినో, మారుతున్న వాతావరణ పరిస్థితుల ప్రభావాలను ఎదుర్కొనేలా గ్రామాల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. వీబీ జీ రామ్ జీ కార్యక్రమంలో భాగంగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక (వీజీపీపీ) తయారీపై శుక్రవారం కలెక్టరేట్‌లో సర్పంచులు, పంచాయతీ కార్య దర్శులు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి, వాటికి ప్రాధాన్యత క్రమం నిర్ణయించి వచ్చే ఐదేళ్లకు ఉపయోగపడేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గ్రామంలోని వనరులు, అవసరాలు, అభివృద్ధి అవకాశాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా నీటి భద్రత, వాతావరణ మార్పుల ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ అవసరాలకు తగిన పనులను ప్రణాళికలో చేర్చాలని ఆదేశించారు.
గ్రామ పంచాయతీ ప్రణాళికలను అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో ప్రవేశపెట్టి ఆమోదం పొందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామసభలకు ప్రజలందరూ హాజరయ్యేలా చూడాలని, వివిధ శాఖల అధికారులు తమ పరిధిలోని పనులను గుర్తించి సాంకేతిక సూచనలు, ప్రతిపాదనలను ప్రజలకు వివరించాలని తెలిపారు. గ్రామాల్లో వేజ్ సీకర్స్ సంఖ్యను పెంచడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని సూచించారు.
వీబీ జీ రామ్ జీ కార్యక్రమం ద్వారా 22 విభాగాలకు సంబంధించిన 318 రకాల పనులను గ్రామాల్లో చేపట్టే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. గ్రామానికి అత్యవసరంగా అవసరమైన పనులను గుర్తించి వీజీపీపీలో చేర్చుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దార్శనికుడు డీన్ దయాళ్: ఎంపి అరుణ



**నారాయణపేట, సెప్టెంబర్ 25(జనంసాక్షి):** జనసంఘ్ వ్యవస్థాపకులు డీన్ దయాళ్ ఉపాధ్యాయ దేశానికె దార్శనికుడు అని పాలమూరు ఎంపీ డికె అరుణ అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో దిన్ దయాళ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎంపి అరుణ మాట్లాడుతు ఒక దేశంలో ఇద్దరు ప్రధానులు,రెండు రాజ్యాంగాలు చెల్లదని ఆత్మబలిదానం చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు.ఆయన ఆశయాలను నేడు ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో కొనసాహిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రతంగ్ పాండు రెడ్డి,పగుడాకుల శ్రీనివాస్,పవన్ కుమార్ రెడ్డి,సత్య యాదవ్,రఘువీర్ యాదవ్,నందు నామాజీ,రఘు రామయ్య గౌడ్, లక్ష్మీ శ్యామ్ సుందర్ గౌడ్,మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్య యాదవ్,వైస్ చైర్మన్ మంజుల జి ఆర్ రెడ్డి,సత్య రఘుపాల్,ఉమేష్,పోషాల్ వినోద్ ,సిద్ది వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## శ్యామప్ప కుటుంబానికి పోలీస్ శాఖ అండ



**గద్వాల, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** విధి నిర్వహణలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ శ్యామప్ప కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఎస్పీ టి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో శ్యామప్ప వారసులకు కార్పస్ ఫండ్ కింద చెక్కులను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అందాల్సిన సంక్షేమ ప్రయోజనాలు, శాఖాపరమైన సహాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలీసు కుటుంబాల సంక్షేమానికి శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలకు అండగా నిలవడం శాఖ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

## బడంపేట్ రాచన్న స్వామి ఆలయానికి పునరుద్ధరణకు శ్రీకారం





**కోహీర్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం బడంపేట్ గ్రామంలోని శ్రీ రాచన్న స్వామి ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం అధికారికంగా శ్రీకారం చుట్టింది. ఆలయ అభివృద్ధి, పునరుద్ధరణ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు 14 మందితో ప్రత్యేక రెనోవేషన్ కమిటీని ఏర్పాటు చేస్తూ రెవెన్యూ (ఎండోమెంట్స్-××) శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆలయ అభివృద్ధిపై భక్తులు, గ్రామస్తుల్లో ఆశలు నెలకొన్నాయి.

**14 మందితో కమిటీ ఏర్పాటు...**

తెలంగాణ చారిటబుల్ అండ్ హిందూ రిలిజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ యాక్ట్-1987లోని సెక్షన్ 146 ప్రకారం కమిటీని ఏర్పాటు చేశారు. మడపతి జగదీశ్వర స్వామి, రాచమల్ల సరస్వతి, బొలిన్ని శ్రీపాల్, గడ్డ గోపాల్, గొలెముల ప్రతాప్‌రెడ్డి, బొగ్గుల నర్సింలు, బ్యాగరి రాచన్న, దెగుబారి సతీష్, బోయిని రాజు, జాడే అక్షయ్, చీర్ల రాజు, రేణం మురళీధర్, బిల్లపాటి బాపూజీ, గొల్ల రాజ్‌కుమార్‌లను సభ్యులుగా నియమించారు.

**మూడేళ్ల పాటు కొనసాగనున్న కమిటీ...**

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రెనోవేషన్ కమిటీ మూడేళ్ల పాటు కొనసాగనుంది. ఆలయ పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు ఎండోమెంట్స్ శాఖ, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లనుంది. ఎండోమెంట్స్ శాఖ డైరెక్టర్ సమర్పించిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలించిన అనంతరం కమిటీ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**నాయకుల హాజరుతో సందడి...**

ఆలయ పునరుద్ధరణకు సంబంధించిన కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, జహీరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డా. ఎ. చంద్రశేఖర్, ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉజ్వల్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ ముబీన్, మహిళా అధ్యక్షురాలు అస్మా, కోహీర్ కాంగ్రెస్ అధ్యక్షురాలు టీ. సువర్ణ మల్లన్న పాటిల్, మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్, టౌన్ ప్రెసిడెంట్ ముజాఫర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.
కమిటీ ఏర్పాటుతో ఆలయ పునరుద్ధరణ పనులు కార్యాచరణ దశలోకి వస్తాయని భక్తులు భావిస్తున్నారు. ఆలయ మౌలిక వసతులు మెరుగుపడి భక్తులకు మరింత సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.